క్లుప్తంగా

పేద విద్యార్థుల చదువులకు చేయూత



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నారై విద్యాసంస్థల్లో అంతర్భాగమైన సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ (ఎస్ఎఫ్ఆర్ఎస్) ఆధ్వర్యంలో బీటెక్, లా కోర్సులు చదువుతున్న నలుగురు పేద విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం విద్యానగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఏవో మన్నవ రవిప్రసాద్, ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు విద్యార్థులు పి.హేమంత్ సాయి, పి. పూజిత, కె. అంజికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో చివరి విడతలో ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో ఇచ్చారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సులు చదువుతున్న 33 మంది విద్యార్థులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసినట్లు తిలక్‌బాబు చెప్పారు. ప్రొఫెషనల్ కోర్సులు చదువుతూ ఎస్ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆర్థిక సహాయాన్ని పొందగోరు విద్యార్థులు విద్యానగర్ 3వ లైనులోని సంస్థ కార్యాలయంలో సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

వట్టిచెరుకూరు తహసీల్దారు శ్రీనివాసరావుకు దళితుల వినతి

గుంటూరు రూరల్: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మండలంలోని అనంతవరప్పాడులోని దళిత కాలనీవాసులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో 800 మంది నివసిస్తున్నారని, శ్మశానవాటిక లేక పంట కాలువ కట్టపై శవాలను పూడ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా, తమ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి శ్మశానవాటికకు స్థలం చూపించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



పాంద్రపాడు(కాకుమాను):పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. మండలంలోని పాంద్రపాడు, కొల్లిమర్ల, చినలింగాయపాలెం, వల్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్ని బుధవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ క్షణమైనా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తుప్పు తెగులుపై అప్రమత్తత అవసరం

వరగాని(కాకుమాను):రబీలో శనగ సాగు చేస్తున్న రైతులంతా తుప్పు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని వరగానిలో బుధవారం రైతులకు పొలంబడి నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ శనగ పంటపై అక్కడక్కడా తుప్పు తెగులు కనిపిస్తోందని, నివారణకు ప్రొఫికొనజోల్ మిల్లీ లీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు. వివిధ రకాల పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులంతా అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పొలంబడి నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

బాలుడి ఆచూకీ లభ్యం



పొన్నూరు: పట్టణానికి చెందిన షేక్ మహబూబ్ (14) ఈనెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సీఐ పి. భాస్కర్ తెనాలిలో బంధువుల ఇంటిలో ఉన్న మహబూబ్‌ను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని రవి కాలనీకి చెందిన శాంతి వీరమ్మ నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

టీడీపీ నేతల బెదిరింపులకు భయపడం

మంత్రి విడదల రజిని



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: కార్యాలయాలు పగులగొడుతున్నారు... మంచి పనులు చేస్తుంటే అడ్డుకుంటున్నారు... అభివృద్ధి కార్యక్రమాలకు వెళుతుంటే కాన్వాయ్‌లకు అడ్డుపడుతున్నారు... నేను బీసీ మహిళనని కావాలనే ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెట్టి అణగదొక్కాలని చూస్తున్నారు.. గుర్తుపెట్టుకోండి.. నీచ రాజకీయాలు, బెదిరింపులకు తలొగ్గేదేలేదని ... ఎన్ని డ్రామాలు చేసినా, ఉడత ఊపులు ఊపినా.. వెనకడుగు వేసే ప్రసక్తే లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. గుర్తు పెట్టుకోండి.. నాపేరు రజిని.. తగ్గేదేలేదని హెచ్చరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 49వ డివిజన్ పోస్టల్ కాలనీలో కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, లూకారాణి, వసుంధర, ఝాన్సీల ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన వంద మంది టీడీపీకి చెందిన వారు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ తాను ఒక మహిళ అని చూడకుండా టీడీపీ నేతలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్షాన పోరాడేందుకు అన్ని వర్గాల ప్రజలతోపాటు, ఎంతటి ఆపదలో ఉన్నా ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఓటమి భయంతో దాడులు చేస్తున్నారని, ఇటువంటి రాజకీయాలకు భయపడేదేలేదని తేల్చి చెప్పారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఓటమి దెబ్బ ఎలా ఉంటుందో టీడీపీ నేతలకు రుచి చూపిస్తామని తెలిపారు.

నవరత్నాలు నవశకానికి నాంది

సీఎం వై.ఎస్. జగనన్న తన పరిపాలనలో మహిళలకు అందించిన నవరత్నాలు నవశకానికి నాంది పలికాయని మంత్రి రజిని చెప్పారు. మహిళలకు అగ్రతాంబూలాన్ని ఇచ్చి అన్ని విధాలుగా, అండగా నిలిచి వారిలో చైతన్యం తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతోందన్నారు. వైఎస్సార్ సీపీకి పూర్తి స్థాయిలో మహిళా లోకం అండగా ఉందని స్పష్టం చేశారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం సీఎం జగన్ననకు, తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము, వైఎస్సార్‌సీపీ నేతలు రంగారెడ్డి, సత్య, శంకర్, ప్రసన్నకుమార్, గౌరీశంకర్, వేణు, శివప్రసాద్, నూతనపాటి వెంకటేశ్వర్లు, సుబ్బు, రమేష్ పాల్గొన్నారు.

నేతన్నలకు అండగా ఉంటాం



అసోసియేషన్ నేతలతో మంత్రి రజిని

నేతన్నలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుజ్జనగుండ్లలో నిర్మాణంలో ఉన్న చేనేత కల్యాణ మండపం, విద్యార్థుల వసతి గృహాల్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తమకు వసతి గృహం, కిచెన్, డైనింగ్ హాలు, లైబ్రరీల నిర్మాణానికి స్థలం పక్కనే ఉన్న మరో స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి రజిని మాట్లాడుతూ వసతి గృహ నిర్మాణానికి తనవంతు సాయం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం జరిగిన సభకు వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు కన్నా మాస్టారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేతల పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న వేళ సుదీర్ఘ పాదయాత్రలో ప్రతి ఒక్కరి కష్టాన్ని గమనించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో వారిని ఆదుకున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా వారికి ఎంతో మేలు చేకూర్చారని పేర్కొన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ... నామినేటెడ్ పోస్టులు మొదలుకొని, మంత్రివర్గ కూర్పు వరకు వారికి ఎంతో మేలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, నేత బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, చేనేత సంఘ నాయకులు గోలి వెంకటేశ్వరరావు, గుర్రం చిన వీరయ్య, కోటా సత్యం, సూరేపల్లి ఈశ్వరరావు, మాచర్ల వీరరాఘవయ్య, చిన్నం వెంకటసుబ్బారావు, కారంపూడి వాసుదేవరావు, డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని శాసనమండలి విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయిన చెక్కుల్ని బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్ని బలోపేతం చేస్తూ వైద్యాన్ని మన గుమ్మం వద్దకు తెచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది అన్ని జబ్బుల్ని చేర్చారన్నారు. నేడు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి ఒక్కరికీ రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు సైతం సీఆర్ఎఫ్ కింద నగదు మంజూరు చేస్తూ ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడే పరిస్థితులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల్ని చేపట్టి తండ్రిని మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా పరిపాలన చేస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలబడాలని అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసరెడ్డి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

ఎస్పీ తుషార్ డూడీ



పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

పట్నంబజారు: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం గుంటూరు నగరంలోని ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గల పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పూర్తి స్థాయిలో పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ముఖ్యమైన కేసుల వివరాలు, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఎలక్షన్ సంబంధిత వివరాల అంశాలపై పాత గుంటూరు సీఐ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ కేసు దర్యాప్తులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పాటు, నిర్దిష్టమైన ప్లాన్, యాక్షన్‌తో పెండింగ్ కేసులు తగ్గించాలని ఆదేశించారు. నేర నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పాతగుంటూరు పీఎస్ పరిధిలో బస్టాండ్ ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐను ఆదేశించారు. తనిఖీల్లో ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచికేష్ షలేకే, స్పెషల్ బ్రాంచి సీఐ వెంకట్రావు, పాత గుంటూరు పీఎస్ ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ఇంధన పొదుపు తప్పనిసరి

నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర్రామిరెడ్డి

నెహ్రూనగర్: మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరని నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర్రామిరెడ్డి తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నగరపాలక సంస్థ పంప్ ఆపరేటర్లకు ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుందర్రామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు ఇంధన పొదుపు అంశంలో కీలకంగా ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపుకే వినియోగిస్తున్నందున, ఇతర అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కూడా సంరక్షణ అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం పంప్ ఆపరేటర్లకు టూల్ కిట్లు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ సీఈ శివప్రసాద రాజు, ఈఈ శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

హెడ్ నర్సుగా రోజ్ రాణి సేవలు అభినందనీయం



రోజ్ రాణి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో హెడ్ నర్సుగా పని చేస్తున్న దాసరి రోజ్ రాణి బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు సేవ చేయడం వరంలా భావించి హెడ్ నర్స్ రోజ్ రాణి పని చేశారని అభినందించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్ వైద్య విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ టి.వి. శివరామకృష్ణ, డాక్టర్ జి. దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని పాల్గొన్నారు.

ఏటగా విధుల్లో చేరిన ప్రతాప్‌బాబు

గుంటూరు జీజీహెచ్ పరిపాలనా అధికారిగా(ఏఓ) దేవరపల్లి ప్రతాప్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై జీజీహెచ్ ఏటగా విధుల్లో చేరారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో ప్రతిభకు పదును



జైన్ హైస్కూల్‌లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో ప్రిన్సిపాల్ కనకదుర్గ



జీకేఆర్ హైస్కూల్లో విద్యార్థినులతో జనార్దన్‌రెడ్డి, సుశీలారెడ్డి



ప్రాజెక్టులను తిలకిస్తున్న డాక్టర్ అభిలాష్, లతాశ్రీ, చంద్రశేఖర్‌రెడ్డి

- పలు పాఠశాలల్లో ఘనంగా సైన్స్ డే
- ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని జైన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. కనకదుర్గ పేర్కొన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠ్యాంశాల్లో నేర్చుకున్న అంశాలతో నమూనా ప్రాజెక్టులను రూపొందించి, ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎండీ మున్ను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లోని ప్రతిభకు అద్దం పట్టింది. విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాల సమాహారంగా విద్యార్థినీ, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జి. జనార్దన్‌రెడ్డి, హెచ్ఎం జి. సుశీలారెడ్డి పాల్గొన్నారు.

===ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ కార్నివాల్–2024 ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న విజన్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల చైర్మన్ డాక్టర్ అభిలాష్, డాక్ట్ లతాశ్రీ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులను తిలకించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో సీవీ రామన్ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- పంజాలోని జవహర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వివిధ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, మంగళగిరిలోని ఎయిమ్స్‌లో రేడియాలజీ ఆంకాలజిస్టుగా పని చేస్తున్న డాక్టర్ ఎస్. హవీలా మేరీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రాజెక్టులను తిలకించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- ప్రకృతిలోని ప్రతి అంశంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కెనడీ నెక్ట్సజన్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రీవిద్య అన్నారు. అరండల్‌పేటలోని పాఠశాలలో బుధవారం సి.వి.రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆలోచనా విధానం, అవగాహన, సృజనాత్మకతతో ఆలోచిస్తూ ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి వసంతలక్ష్మి మాట్లాడుతూ ప్రకాశవంతమైన జ్ఞానంతో ప్రతి విద్యార్థి ఎదగాలని సూచించారు. విద్యార్థులు రోప్‌వే, చంద్రయాన్ -3, ఆర్గానిక్ ఫార్మింగ్, గ్రీన్ హౌస్ తదితర నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, అతిథులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.
- చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో వైజ్ఞానిక ప్రతిభ అభినందనీయమని విశ్రాంత ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. మారుతీనగర్‌లోని యాపిల్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనా ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.పేరిరెడ్డి, ఏవో పి.శ్రీలక్ష్మి, ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రాజెక్టులతో జవహర్ ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు



విద్యార్థిని తయారు చేసిన నమూనా గురించి తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీవిద్య, వసంతలక్ష్మి



ప్రాజెక్టులను తిలకిస్తున్న సత్యనారాయణ, పేరిరెడ్డి

● జగనన్న పాలనలో అభివృద్ధి పథంలో గ్రామాలు

గుంటూరు రూరల్: జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు పరుగులు పెడుతోందని 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి తెలిపారు. డివిజన్ పరిధిలోని నల్లపాడులో బుధవారం రూ. 25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్ని ఆమె పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కారణంగా ఏమైనా మార్పులు చేస్తే వాటి వివరాలను బీఎల్‌ఓల ద్వారా ఓటర్లకు తెలియజేస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ, రివిజన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా కేంద్రాల్ని మార్చాల్సి వస్తే వాటిని పార్టీల ప్రతినిధులకు, స్థానిక ఓటర్లకు తెలియజేస్తామన్నారు. బీఎల్‌ఓలు కూడా కేంద్రం పరిధిలోని ఓటర్లకు వివరించి, వారి నుంచి సంతకాలు కూడా తీసుకోవాలని ఆమె సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు కూడా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్ని మరొకసారి పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 25 వరకు తూర్పు నియోజకవర్గంలో 339, పశ్చిమ నియోజకవర్గంలో 510 వివిధ క్లెయిమ్స్ అందాయని, వాటిని బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులు క్షేత్ర పరిశీలన చేసిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, వైఎస్సార్‌సీపీ నుంచి డి.జానీ బాష, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి పాండురంగ విఠల్, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి డి.బాలాస్వామి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత



గుంటూరు మెడికల్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిరి మహిళ సాధికారిత సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రత్యేక కళాకారుల బృందాలతో బుధవారం గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లంకపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ ప్రజలు హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి పూర్తిగా తెలుసుకుని వ్యాధి బారిన పడకుండా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య సేవలను సైతం అందిస్తోందని వెల్లడించారు. బాధితుల పట్ల వివక్ష చూపించకూడదని తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధుల్ని గుర్తించి నియంత్రణలో పెట్టేందుకు అత్యాధునిక మందులు నేడు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు వైద్య సేవలు తదితర విషయాల్ని కళాకారులు జానపదాల రూపంలో జాతాలో వివరించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ శ్రీనివాస్, ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, సీబీఓ సభ్యులు పాల్గొన్నారు.